# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### పట్వారీలు పైసలు తింటర్..

ధరణిని తీసేసి పాత పద్ధతి పట్వారీ వ్యవస్థ వస్తే రైతుల వద్ద పైసలు తింటరు కానీ పని కాదు. భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే దినాం ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తది. స్టాంప్ వేసే అటెండర్ నుంచి పెద్ద సారు దాక డబ్బులు ఇచ్చుకోవాలె. 'ధరణి'తోని పైసా ఖర్చు లేకుండా పట్టాలవుతున్నయ్. పాత పద్ధతి తీసుకొచ్చే కాంగ్రెస్ మాకొద్దు.

– చంద్రప్ప, గ్రామం కోకట్ (యాలాల)



### దళారులు రాజ్యమేలుతరు..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళారులు రాజ్యమేలుతరు. 'ధరణి'ని వద్దనే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం. 'ధరణి'తో ప్రశాంతంగా ఉన్న రైతులం పైరవీకారుల చుట్టూ తిరగాల్సిందే.. రైతులను ఏనాడు పట్టించుకోని కాంగ్రెస్.. ఎన్నికల వేళ డ్రామాలు ఆడుతున్నది. ఏదిఏమైనా మా మద్దతు కారు గుర్తుకే..

– సంతోష్ నాయక్, గ్రామం మారేపల్లి తండా (పెద్దేముల్)



### భూములకు భద్రత ఉండదు..

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే నట్టేట మునిగినట్టే. 'ధరణి'ని రద్దు చేసి మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తమంటున్నరు. గతంలో ఎవరి భూములు ఎవరికో రాసేవారు. అది సరిచేసుకోవడానికి నెలలకొద్దీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. రైతులను ఇబ్బంది పెట్టే కాంగ్రెస్ పార్టీని ఎలా ఆదరిస్తం.. సీఎం కేసీఆర్‌కే మద్దతు.

– రాజిరెడ్డి, భూనీడ్(మద్దూర్, కొత్తపల్లి)



### డబుల్ పట్టాలొస్తయ్..

'ధరణి'ని స్థానంలో పాత పద్ధతి తీసుకొస్తే కబ్జాదారులు రాజ్యమేలుతరు. దళారులు, పట్వారీలు లంచాలకు ఆశపడి గతంలో ఒకే భూమిని ఇద్దరికి పట్టాలు చేసిన సందర్భాలున్నయ్. భూ రికార్డులకు భద్రత ఉండదు. గతంలో రిజిస్ట్రేషన్ల కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతాం.

– జగదీశ్, రేగడిమైలారం (బొంరాస్‌పేట)



### అప్పటి కష్టాలు మళ్లొద్దు..

కాంగ్రెస్‌ను నమ్ముకుంటే ఆగమవుతం. 'ధరణి'ని రద్దు చేసి పాత పద్ధతి తీసుకొస్తే మళ్లీ అప్పటి కష్టాలు మేము పడలేం. భూమి అమ్ముకోవాలన్నా.. కొనుకోవాలన్నా.. ఇబ్బందులే. రికార్డుల్లో పేర్లు మారి ఏండ్లకొద్దీ తిరిగేది. కాంగ్రెసోళ్లు రైతులు ఎమన్నకానియ్.. ఓట్లే ముఖ్యమన్నట్లు మాట్లాతుండ్రు. మళ్లీ కారుగుర్తకే ఓటేస్తం.

– నారాయణరెడ్డి, ధర్మాపూర్ (కొడంగల్)




### భూములకు రక్షణ ఉండదు..

'ధరణి' స్థానంతో పాత పద్ధతిని తీసుకొస్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నారు. భూములను వీనిది వానికి.. వానిది వీనికి రికార్డులు రాసి మళ్లీ పంచాయితీలు తెచ్చేటట్టున్నరు. గతంలో భూ వివాదాలు ఎక్కువగా ఉండేవి. ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలె. 'ధరణి' వచ్చాకే భూ సమస్యలు పోయాయి.

– బోయిని అశోక్, కొర్విచేడ్ (బషీరాబాద్)

## భూ'మేత' కోసమే..



## భూములను కొల్లగొట్టేందుకే 'భూమాత'ను తెస్తామంటున్న కాంగ్రెస్

- 'ధరణి'తో ఏండ్లనాటి భూ సమస్యలకు చెక్
- దోపిడీ వ్యవస్థను తెచ్చేందుకే 'భూ మాత' పోర్టల్ అంటూ రైతుల ఆగ్రహం
- కౌలుదారుల కాలమ్‌తో మళ్లీ రేగనున్న భూ వివాదాలు
- అన్నదాతల హక్కులకు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ కుయుక్తులు

వికారాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెసొస్తే 'ధరణి'ని రద్దు చేస్తామన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం ఐక్యంగా వ్యతిరేకిస్తున్నది. ధరణికి ముందు రైతులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటున్నారు. పారదర్శకంగా సేవలందిస్తున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తే మళ్లీ డబుల్ రిజిస్ట్రేషన్లు, ఇష్టారాజ్యంగా రికార్డుల మార్పులు, చేర్పులు, ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్లు, ఏండ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు, వారసత్వ భూముల విషయంలో రోజుల తరబడి తిరగడంతోపాటు పైరవీకారుల పెత్తనం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి తీసుకురాకముందు డబుల్ రిజిస్ట్రేషన్లతో ప్రజలు లక్షలు పెట్టి కొనుగోలు చేసిన భూముల కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొని ఉండేది. ఎలాంటి రికార్డు పరిశీలన లేకుండా రిజిస్ట్రేషన్లు చేయడంతో 'ధరణి'కి ముందు చాలా వరకు ఒకే భూమి ఇద్దరు, ముగ్గురి పేరిట రిజిస్ట్రేషన్లు అయ్యేవి. గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లన్నీ సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లోనే జరిగేవి. వ్యవసాయ భూములకు సంబంధించి రికార్డులు మాత్రం మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఉండేవి. దీంతో ఎవరు స్లాట్ బుక్ చేసుకున్నా ఎలాంటి పరిశీలన, తనిఖీలు లేకుండానే సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేసేవారు. 'ధరణి' అందుబాటులోకి వచ్చిన అనంతరం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతలను తహసీల్దార్లకు అప్పగించడంతో రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుక్ చేసుకున్న వెంటనే సంబంధిత సర్వే నంబర్ భూ రికార్డులను పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ చేస్తుండడంతో డబుల్ రిజిస్ట్రేషన్లకు పూర్తిగా అడ్డుకట్ట పడింది. నిషేధిత భూములైన ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ తదితర భూములను కూడా 'ధరణి'కి ముందు రిజిస్ట్రేషన్లు చేస్తుండేవారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన అనంతరం నిషేధిత జాబితాలో చేర్చి ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా ధరణి పోర్టల్ నిషేధిత భూముల జాబితాను గ్రామాల వారీగా పొందుపర్చారు. గతంలో కోర్టు కేసులున్నా రిజిస్ట్రేషన్లు జరిగిన పరిస్థితులుండేవి కానీ ప్రస్తుతం కోర్టు కేసులున్నట్లయితే ధరణి పోర్టల్‌లో కోర్టు ఇంటిమేషన్ ఆప్షన్‌లో కోర్టు ఆర్డర్‌ను పొందుపర్చి దరఖాస్తు చేసుకున్నట్లయితే సంబంధిత సర్వే నంబర్ జిల్లా కలెక్టర్ క్రయవిక్రయాలు జరగకుండా బ్లాక్ చేస్తున్నారు. మరోవైపు రిజిస్ట్రేషన్ పూర్తైన తర్వాత కూడా గతంలో రాతపూర్వక డాక్యుమెంట్ కావడంతో వివరాలు తప్పుగా రాసి గందరగోళం సృష్టించేవారు, కానీ ప్రస్తుతం ధరణి పోర్టల్‌లోనే డాక్యుమెంట్ తయారై వస్తుండడంతో ఎలాంటి మార్పులు, చేర్పులు చేసే ఆస్కారం లేకుండా పారదర్శకత అందుబాటులోకి వచ్చింది. గతంలో కొందరు అవినీతి అధికారులు భూ రికార్డులను కూడా తారుమారు చేసిన పరిస్థితులున్నాయి. 'ధరణి' అందుబాటులోకి వచ్చిన అనంతరం ఒక్కసారి వివరాలను పొందుపర్చినట్లయితే మార్పులు, చేర్పులు చేసేందుకు ఎవరికీ ఆస్కారం లేకుండా రైతుల సంక్షేమం కోసం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో జరిగిన అక్రమాలకు అడ్డుకట్ట వేసిన ధరణి పోర్టల్‌తోనే పారదర్శకంగా సేవలందుతాయని, ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెబుతామంటున్నారు జిల్లా రైతాంగం.



### లంచాల రాజ్యమొస్తది..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే లంచాల రాజ్యమొస్తది. అప్పట్లో భూములకు సంబంధించి ఏ పని కావాలన్నా వీఆర్‌వో, ఆర్ఐ, డీటీ, తహసీల్దార్.. చేతులు తడుపడమే కాకుండా అటెండర్‌కు సైతం డబ్బులియ్యాల్సి వచ్చేది. చక్కదనాల 'ధరణి'ని తీసేసి పాత పద్ధతిని తీసుకొస్తామనే కాంగ్రెసోళ్లకు దిమ్మతిరిగేలా బుద్ధి చెప్పాలె.

– బీడే నాగప్ప వీర్‌శెట్టిపల్లి (తాండూరు)



### కాంగ్రెస్‌వి రైతు వ్యతిరేక చర్యలు

కాంగ్రెస్ పార్టీవి రైతు వ్యతిరేక చర్యలు. అధికారంలోకి వస్తే 'ధరణి'ని తీసేస్తామనడం సరికాదు. ప్రశాంతంగా ఉన్న రైతుల బతుకుల్లో నిప్పులు పోసేలా ఉండ్రు. ఈ దొంగలకు రాజ్యమిస్తే రైతులు రందీ పడుతరు. 'ధరణి'తో భూములకు రక్షణ ఉన్నది. కాంగ్రెస్ పార్టీకి ఎట్టి పరిస్థిలో ఓటు వెయ్యం. కారు గుర్తుకే నా ఓటు.

– చాకలి కృష్ణయ్య, గాడిర్యాల్ (మహమ్మదాబాద్)



### కౌలుచట్టం మాకొద్దు..

కాంగ్రెస్‌కు పట్టం కడితే కౌలుచట్టం అమల్లోకి తీసుకొస్తామనడం సరికాదు. పట్టేదారుకు కాకుండా కౌలుదారుకు హక్కులివ్వడమేందీ. కాంగ్రెస్ హయాంలో మా తండ్రి, తాతలు చాలా బాధలు ఎదుర్కొన్నరు. సీఎం కేసీఆర్ పుణ్యమా అని 'ధరణి' వల్ల మా భూములు భద్రంగా ఉన్నయ్. సంతోషంగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నం.

– రమేశ్, పెద్దవార్వాల్ (గండీడ్)



### రైతులను దోచుకుంటరు..

కాంగ్రెస్‌కు ఓటేస్తే 'ధరణి' రద్దు చేస్తరు. మళ్లీ లంచగొండీలు తయారైతరు. ఏ చిన్న పని ఉన్నా రైతులను దోచుకుతింటరు. పైసలియ్యకపోతే రేపుమాపంటూ ఏండ్ల కొద్దీ తిప్పి చంపుతరు. గతంలో కాంగ్రెస్ హయాంలో పడిన కష్టం చాలదా.. మళ్లీ ఆగమయ్యేందుకు సిద్ధంగా లేము. కారుగుర్తుకే మా ఓటు.. కేసీఆరే మళ్లీ సీఎం.

– రవిగౌడ్, అంగడిచిట్టంపల్లి (పూడూరు)